# ప్రపంచీకరణ... చైనా అనుభవాలు

**ఆర్థిక సరళీకరణల నేపథ్యంలో.. 1980ల నాటి నుంచి లబ్ధిపొందుతున్న అతికొద్ది దేశాల్లో చైనా ఒకటి! ఆ దేశం గత రెండు దశాబ్దాల్లో గణనీయమైన ఆర్థికవృద్ధిని సాధించింది. అదే ఒరవడిని కొనసాగిస్తూ.. కమాండ్ ఆర్థిక వ్యవస్థ నుంచి... మార్కెట్ ఆధారిత వ్యవస్థగా రూపాంతరం చెందడానికి కృషిచేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన వాణిజ్య సరళీకరణ చైనా అధికవృద్ధికి కారణమైంది. నేడు 'మేడ్ ఇన్ చైనా' అనే పదం విశేష ప్రాచుర్యం పొందింది. ఇలా చైనా అనేక రంగాల్లో ఎంతో ఆర్థిక ప్రగతి సాధించినా.. ఆ ప్రగతి ఫలాలు లక్షల మంది సామాన్య ప్రజలకు ఇంకా అందాల్సి ఉంది!!**

ప్రపంచీకరణ నేపథ్యంలో.. అనేక స్థాయిల్లో పారిశ్రామికాభివృద్ధి సాధించే అవకాశం చైనాకు లభించింది. ఆట వస్తువులు, గృహవినియోగ వస్తువుల ఉత్పత్తి దశనుంచి... విమాన పరికరాల తయారీ, కార్లు, ట్రక్కులు, ఓడలు, సబ్‌మెరైన్, శాటిలైట్స్, రాకెట్లు తయారుచేసే దశకు చేరింది. మౌలిక సౌకర్యాలపై అధిక పెట్టుబడులతోపాటు విద్య, ఆరోగ్య రంగాలపై వ్యయం పెంపు మానవాభివృద్ధికి కారణమైంది. తక్కువ వ్యయంతో కూడిన సాంకేతిక విజ్ఞానం... దేశంలోని అన్నిరంగాల్లో ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుదలకు.. తద్వారా స్థూలదేశీయోత్పత్తికి దారితీసింది. పారిశ్రామికీకరణ ఊపులో ఆ దేశం అంతర్జాతీయంగా చమురు క్షేత్రాలను కొనుగోలు చేసింది. సౌదీ అరేబియా, రష్యన్ కంపెనీలతో చమురు, గ్యాస్ సప్లయ్ ఒప్పందాలను చేసుకుంది. వివిధ దేశాల్లో లభ్యమయ్యే తుక్కు ఇనుమును, ఉక్కును కొనుగోలు చేసే అతిపెద్ద దేశంగా కూడా అవతరించింది. పెద్దఎత్తున పారిశ్రామికీకరణ చేపడుతూ... కంప్యూటర్లను సైతం ఇతర దేశాలకు ఎగుమతి చేస్తోంది. గత ఐదేళ్లుగా చైనా సగటు వార్షికవృద్ధి 10.5 శాతం. ఈ సంవత్సరం 9.5 నుంచి 9.7 శాతం; వచ్చే ఏడాది 8 నుంచి 8.5 శాతం వరకూ ఉండగలదని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ ప్రభావం చైనాపై పెద్దగా ఉండకపోవచ్చు. 2003 తర్వాత చైనా ఎగుమతులు, దిగుమతుల విలువలో గణనీయమైన ప్రగతి కనిపించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత తిరోగమన తరుణంలోనూ.. చైనా వాణిజ్య పరిమాణం తగ్గే సూచనలు కనిపించకపోవడం విశేషం!

## ఉపాధి ఊపందుకుంది:

చైనా నీటిపారుదల రంగం, వ్యవసాయ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడం.. ఆ దేశ వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడింది. భారతదేశ స్థూలదేశీయోత్పత్తికి సేవారంగం దోహదపడగా.. చైనాలో స్థూలదేశీయోత్పత్తి పెరుగుదలకు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు తోడ్పాటునందించాయి. ఆ దేశం గ్రామీణ పారిశ్రామికీకరణపై శ్రద్ధ చూపడంతో అవి మంచి పురోగతి సాధించాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరిగిన పారిశ్రామికాభివృద్ధి.. వ్యవసాయేతర రంగాల్లో ఉపాధిని పెంచింది. జనాభాను నియంత్రించేందుకు చైనా తీసుకున్న చర్యలు సత్ఫలితాల నిచ్చాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో

జనాభా పెరుగుదల రేటు ప్రస్తుతం 2 శాతం ఉండగా.. చైనాలో అది 1 శాతం కన్నా తక్కువే. One child norm, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు కుటుంబ నియంత్రణ పాటించిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం.. వంటి చర్యల ద్వారా జనాభా నియంత్రణను ప్రజా ఉద్యమంగా మలచడంలో ఆ దేశం విజయం సాధించింది.

## 12 రెట్ల ప్రగతి:

1978 నుంచి 2007 మధ్యకాలంలో.. చైనా 12 రెట్లు వృద్ధి సాధించింది. 1990లలో అమెరికా తర్వాత అత్యంత అధికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకర్షించిన దేశంగా రెండో స్థానంలో నిలిచింది. 2007-08 మానవాభివద్ధి నివేదిక ప్రకారం.. చైనాలో తలసరి విద్యుత్ వినియోగం.. 2004లో 1,684 కిలోవాట్- అవర్స్. కాగా, మన దేశంలో 618 కిలోవాట్-అవర్స్ మాత్రమే. చైనాలో నేటికీ విద్యుత్ సౌకర్యం పొందని ప్రజల శాతం 8.5. తలసరి విద్యుత్ వినియోగం ఆర్థికాభివృద్ధికి ఒక ముఖ్య సూచిక. వాణిజ్య సరళీకరణ విధానాల ద్వారా.. ఆ దేశం అనేక ప్రయోజనాలు పొందినప్పటికీ.. వాటి ధనాత్మక ప్రభావం అనేక మిలియన్ల చైనీయులకు చేరాల్సి ఉంది. మరోవైపు ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో.. ఆ దేశంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలు పెరిగాయి. విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రైవేటీకరణ వల్ల పేదవర్గాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

## శ్రామిక సంస్థ నివేదిక :

1990, 2007 మధ్యకాలంలో చైనా తన శ్రామికులకు మంచి వేతనాలు అందించిందని; ఉత్పాదకత, వేతన వృద్ధి నిష్పత్తి 9:10 శాతంగా ఉందని అంతర్జాతీయ శ్రామిక సంస్థ తాజా అధ్యయనాలు తెలిపాయి. అధిక వేతనాల చెల్లింపు వల్ల దేశంలో సమష్టి డిమాండ్ పెరుగుదలకు.. అధిక ఉత్పత్తికి దారితీసి, ఉపాధి పెరుగుదలకు కారణమైంది. గత రెండు దశాబ్దాలుగా భారతదేశంలో ఉత్పాదకతలో సగటు వృద్ధి 5 శాతం. అయినప్పటికీ వేతన వృద్ధి 1 శాతం మాత్రమేనని సదరు నివేదిక పేర్కొంది. వేతనాలు, ఉత్పాదకత మధ్య వైరుధ్యానికి సంబంధించి 32 దేశాల్లో సర్వేచేయగా... వేతన-ఉత్పాదకత వైరుధ్యం ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. భారత్‌లో ఆదాయ అసమానతలకు తాత్కాలిక ఉద్యోగిత పెరగడం ఒక కారణమని నివేదిక అభిప్రాయపడింది. లాటిన్ అమెరికా దేశాల్లో సంఘటిత రంగంలో ఉపాధి పొందిన వారి కంటే... అసంఘటిత రంగంలోని శ్రామికులు సగటున 43 శాతం తక్కువ వేతనాలు పొందుతుండగా... మన దేశంలో ఇది 45 శాతం. ఆహార ధరల్లో 9 శాతం, ఆహారేతర ధరల్లో 6.3 శాతం పెరుగుదల.. భారత్‌లో అసమానతలు మరింతగా పెరగడానికి కారణమైంది. 2007లో మన దేశంలో పట్టణ అల్పాదాయ కుటుంబాల కొనుగోలు శక్తి 5 శాతం మేర, పట్టణ ప్రాంతాల్లోని ధనిక కుటుంబాల కొనుగోలు శక్తి 2.2 శాతం మేర తగ్గింది!!